సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | శనివారం 06 జూన్ 2026
సంపుటి: 17 | సంచిక: 159
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.

## యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు



- ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ
- రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

ముంబై,జూన్5(సాక్ష్యం): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.

మిగతా 5 లో..



## అసోంలో మంత్రివర్గ విస్తరణ

### కొత్తగా 12మంది మంత్రులుగా ప్రమాణం

గువాహటి,జూన్5(సాక్ష్యం): అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్

మిగతా 2 లో..



## పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

### ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా
### కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా
### సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని

మిగతా 2 లో..



## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో

మిగతా 2 లో..

# చర్చకు సిద్ధమా?

### బీఆర్ఎస్ 10 ఏళ్లు, నా 30 నెలల పాలనపై సిద్ధం

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి

- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- ఎంపీగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణే మా లక్ష్యం
- జడ్చర్ల సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్



"కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట. వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట. 20 ఏళ్ల క్రితం మీ జిల్లాలో నాటిన మొక్క తెలంగాణ సీఎంగా వృక్షమై నిలబడ్డాడు. నాటి మాదిరిగానే పాలమూరులో ఇప్పుడూ 10 లక్షల ఎకరాలకే నీళ్లు అందుతున్నాయి. గతంలో పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను పట్టించుకోలేదు. రూ.22 వేల కోట్లలో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టులకు ఖర్చు చేశాం. 200 ఎకరాల్లో ఎడ్యుకేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసుకుంటున్నాం. రెండు పడక గదుల ఇళ్లు కట్టినచోటే మీరు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే నేను ఓట్లు అడుగుతా. మీకు డిపాజిట్ వస్తే నా పేరు మార్చుకుంటా"-రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

జడ్చర్ల,జూన్ 5(సాక్ష్యం): నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుం టానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ

మిగతా 2 లో..



## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

### అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు
### సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు

న్యూఢిల్లీ,జూన్5(సాక్ష్యం): దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన

మిగతా 5 లో..

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

- కొత్త పార్టీ పెట్టబోతున్న అన్నామలై
- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బీజేపీకి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న వాదనను పట్టించుకోని బీజేపీ
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బీజేపీ నేత అన్నామలై

చెన్నై,జూన్5(సాక్ష్యం): తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త

మిగతా 5 లో..

## నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కోట్లు దోపిడీ

- కమిషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే
- కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా.. కూలింది
- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే
- పామూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కేసీఆర్ చేసింది శూన్యం
- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రెండోరోజు జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్,జూన్5(సాక్ష్యం): గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని



మిగతా 2 లో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం


### ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.



## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

### సీఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2 లో..

## పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు

- చేనేతతో సంస్కృతి సాంప్రదాయాలు విశ్వవ్యాప్తం
- చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం
- 7వ తేదీ వరకు కొనసాగనున్న చేనేత ప్రదర్శన

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం

మిగతా 5 లో..



## కోహెడ పండ్ల మార్కెట్‌కు నేడు సీఎం శంకుస్థాపన

- శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల
- దేశానికే ఆదర్శంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు సమగ్ర సౌకర్యాలు
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ రంగ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ.3,367.35 కోట్ల వ్యయంతో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకోనున్నదని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు

మిగతా 5 లో..

# చర్చకు సిద్ధమా?

సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్



వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పీటీసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పీటీసి ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే.. పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కెసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. 15 లక్షల రేషన్ కార్డులు అందించాం.4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం.

50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కోట్లు దోపిడీ

ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళు_న్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే



కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.

నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రలుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

## అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

నల్లగొండ,జూన్5(సాక్ష్యం): నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

# సంపాదకీయం

## ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావారణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్దితో పర్యావారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపంగా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషలేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు



దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు.

సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## అసోంలో మంత్రివర్గ విస్తరణ

లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి మండలి సభ్యులసంఖ్య 17కు చేరింది.

కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్



సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కి?ష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. స్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

## పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా

చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



## ఆండాళ్ అమ్మవారి ఊశీజల్ సేవ

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్:
యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, అమ్మవారికి ఊశీజల్ సేవ పర్వాలను అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు.





సాయంత్రం ఆలయంలో ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.వివిధ రకాల పూలతో, తులసి దళాలతో,పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఊంజల్ సేవలో, కొలువై ఉన్న ఆండాళ్ అమ్మవారికి హారతినిస్తూ కీర్తన చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల సన్నాయి మేళంనడుమ అమ్మవారికి ఉంజల్ సేవ మహోత్సవం కోలాహలంగా నిర్వహించారు.మొదటగా శ్రీ మన్య సూక్త పారాయణం జరిపారు. ప్రత్యేకంగా బంగారంతో తయారుచేసిన 108 పుష్పాలను శ్రీవారి సన్నిధిలో ఉంచి వాటితో అర్చన జరిపారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని ఆలయంలోని అద్దాల మండపంలోని ఉయ్యాలలో శయనిపు చేయించారు. గంట పాటు వివిధ రకాల పాటలతో అమ్మవారిని కొనియాడుతూ, లాలి పాటల కోలాహలం కొనసాగింది.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ స్వామి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం వివిధ కైంకర్యాలలో 27,14,674/- ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.

## భూపాలపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

భూపాలపల్లి, జూన్ 5 (సాక్ష్యం) :
భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది ఆలయ ఈవో మహేష్ ఆధ్వర్యంలో



శుక్రవారం ఉదయం కమిటీ చైర్మన్‌గా నాగపురి సమ్మయ్య గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు వారితో పాటు డైరెక్టర్లుగా ఇస్లావత్ రవీందర్ కాగితోజు రమణ, వావిళ్ళ కోమల, బెమ్మడి వెంకటస్వామి, సోదరి బాలయ్య, యంశాని శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు నిర్మాణ దశలో ఉన్న ఆలయాన్ని త్వరగా పూర్తి చేసి భక్తాంజనేయ స్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ నాయకులు కార్యకర్తలు దాదాపు 60 మంది వరకు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి మైనర్ బాలుడు మృతి

కన్నాయిగూడెం, జూన్ 05, (సాక్ష్యం) :
వేసవి సెలవుల్లో అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో సరదాగా ఎంజాయ్ చేద్దామని వచ్చిన బాలుడు( 14)ద్విచక్ర వాహన అదుపుతప్పి మృతి చెందిన సంఘటన తుపాకులగూడెం మూల మలుపు వద్ద శుక్రవారం రోజున జరిగింది. స్థానిక ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన హర్ష వర్ధన్ (14) తన అమ్మమ్మ వాళ్ళ ఊరు అయినటువంటి తుపాకులగూడెం రావడం జరిగింది. ద్విచక్ర వాహనం నేర్చుకునే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి చెట్టును బలంగా ఢీ కొనడంతో మృతి చెందటం జరిగిందని తెలిపారు.. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానకి మృత దేహాన్ని తరలించినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.



## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్

అమరావతి,జూన్5:
జనసేన రాజ్యసభ అభ్యర్థిగా పారిశ్రామిక వేత్త లింగమనేని రమేశ్ పేరు ఖరారైంది. రాజ్యసభ అభ్యర్థిత్వంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు జనసేన ప్రకటించింది. ఈ మేరకు పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ వెల్లడించారు. లింగమనేని రమేశ్‌కు 2015 నుంచి జనసేనతో అనుబంధం ఉంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు ఆయన ఆకర్షితులయ్యారు. శనివారం మధ్యాహ్నం రమేశ్ నామినేషన్ వేస్తారని హరిప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడు తెదేపా, ఒకటి జనసేన తీసుకోవాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. బిజెపికి కూడా కేటాయించాలన్న విషయంలో టిడిపి ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు.

# సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

**ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి**

**బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది**

**సముద్ర ఉత్పత్తులకు కేంద్రం సహకారం ఉండాలి**

**నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో సిఎం చంద్రబాబు**

విశాఖపట్టణం,జూన్5: భారతదేశంలో సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆక్వా ఉత్పత్తుల నాణ్యతను పెంచుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోని మత్స్యసంపదలో 28 శాతం ఏపీ నుంచే వస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో 'నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పదేళ్లలో 5 శాతం నుంచి 70 శాతం పెరుగుదల కనిపించింది.




తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో ఏపీదే అగ్రస్థానం. రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం, సీఫుడ్ ఆదాయంలో 38 శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులు పెరిగేందుకు కేంద్రం అండగా నిలబడాలి. రొయ్యల ఉత్పత్తి మరింత పెరిగేందుకు ఏపీ అన్నివిధాలా అనుకూలం. విశాఖపట్నం, భీమవరం, కాకినాడ, నెల్లూరు, కృష్ణపట్నం ప్రాంతాలు ఆక్వా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. రైతులు పొలాల్లో తీసిన కుంటలు కూడా సంపద సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ డోర్లు తెరిచే ఉంటాయి. వారు ఎప్పుడైనా నన్ను కలవొచ్చు.. ఫోన్ చేసి రావొచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ-ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే' అని పేర్కొన్నారు. ఈుగా, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
### ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
### ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు

విశాఖపట్నం,జూన్5:
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు. నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జీని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత

శ్రీకాళహస్తి,జూన్5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం గంగా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, వన్యప్రాణులు మన పర్యావరణ వ్యవస్థలో కీలక భాగాలని, వాటి సంరక్షణకు చెట్లు అత్యంత అవసరమని పేర్కొన్నారు. చెట్లు భూగర్భ జలాల పెరుగుదలకు, భూసార పరిరక్షణకు, వర్షపాతం ఏర్పడటానికి దోహదపడతాయని చెప్పారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడంలో చెట్లు ముఖ్యపాత్ర పోషిస్తాయని, మేఘాలు నిలిచి వర్షాలు కురిసే అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయని వివరించారు.చెట్లు కేవలం నీడను మాత్రమే కాకుండా పండ్లు, పూలు, ఔషధ గుణాలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవడం మాత్రమే కాకుండా ఆ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్న ఆయన, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు కూడా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషకు విశిష్ట స్థానం ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో మాతృభాష వినియోగం తగ్గుతున్నందుకు ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు వల్ల తెలుగు ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా వెలుగొందిందని పేర్కొన్నారు. తెలుగు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశ, విదేశాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకోవాలని అన్నారు. ప్రాంతీయ అభిమానం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం, సమాజం, ప్రజలు అభివృద్ధి చెందుతారని తెలిపారు.

## 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర

### 7న పోలీస్ సిబ్బందితో 'థీమ్ యోగా' కార్యక్రమం

విజయవాడ,జూన్5:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 7 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర 2026 నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శా వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ప్రతి ఇంటికీ యోగాను చేరువ చేయడం ప్రధాన లక్ష్యమన్నారు. 'థీమ్ యోగా' కార్యక్రమం ఈనెల 7న పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత పర్యాటక ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పవిత్ర సంగమం దగ్గర 10వ తేదీన యోగాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 15, 16, 17 తేదీల్లో యోగా ఒలింపియాడ్ పోటీలను ప్రభుత్వం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని కార్పొరేషన్స్, మున్సిపాలిటీ లెవెల్‌లో 5000 మందికి పైగా యోగా ట్రైనర్స్‌గా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ 5000 మంది యోగా టీచర్స్.. ప్రజలకు యోగా శిక్షణ కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహిస్తారని తెలిపారు.



ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలాగా ఆయా ప్రదేశాలలో యోగా సాధన ద్వారా అధిక సంఖ్యలో ప్రజల భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో నిత్య యోగా కార్యక్రమం జరుగుతోందన్నారు. జూన్ 21న అమరావతి మిషన్ బైపాస్ బ్రిడ్జ్ వద్ద కృష్ణా నదిపై పెద్దఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. ఇందులో దాదాపు 25,000 మంది పాల్గొంటారని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యోగా కార్యాక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా కలిపి దాదాపు కోటి మంది ఈ యోగా సాధనలో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శా పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యోగాంజలి 2026 కార్యక్రమాన్ని పోలీస్ థీమ్‌తో నిర్వహించేందుకు నిర్ణయించామని సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. డ్రగ్స్‌పై దండయాత్ర 2.0 లో భాగంగా గంజాయి వినియోగిస్తున్న చాలా మందిని గుర్తించామన్నారు. వారితో ఒక యోగా శిబిరాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. గంజాయి కేసుల్లో డ్రగ్ పాజిటివ్‌గా గుర్తించిన వారందరినీ ఈసారి ఈ 'యోగాంజలి 2026' కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తామని అన్నారు. పోలీస్ శాఖకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో అవసరమన్నారు. అందుకే యోగా, మెడిటేషన్‌ను ఒక థీమ్‌గా తీసుకుని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. జూన్ 7వ తేదీ బీఆర్‌టీఎస్ రోడ్‌లో సుమారు 3,000 నుంచి 4,000 మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున 25,000 మందితో కృష్ణా నది బ్రిడ్జ్‌పైన యోగా నిర్వహించనున్నామని సీపీ వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా, అద్భుతంగా నిర్వహిస్తామన్నారు. జూన్ 7 నుంచి 21 వరకు 15 రోజుల పాటు జిల్లాలోని 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా హోం మంత్రి వంగలపూడి అనితను ఆహ్వానించినట్లు సీపీ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### ప్రజాప్రతినిధులతో కలసి రామ్మోహన్ సైకిల్ ర్యాలీ

శ్రీకాకుళం,జూన్5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైనది పర్యావరణ మన్నారు. పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ... పర్యావరణ ప్రభావం మనం పీల్చే గాలి, తాగే నీరు,



తినే ఆహారం మీద ఉంటుందన్నారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాని మోదీ గత 12 సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రధానిని ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కొనసాగుతోందన్నారు. మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని పిల్లలకు కూడా అలవాటు చేయాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈరోజు 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. కాలుష్య నివారణ, ఇంధన పొదుపు చర్యల్లో భాగంగానే సీఎం చంద్రబాబు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారని రామ్మోహన్ తెలిపారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఇటీవల 24 లక్షల మంది హైబ్రిడ్ విధానంలో పాల్గొని మహానాడు విజయవంతం చేయడం ఇంధన పొదుపు చర్యలకు ఒక అద్భుతమైన మోడల్ అని చెప్పుకొచ్చారు. ఎ÷-లాస్టిక్ రహిత ఆంధ్రాగా మారుద్దామన్నారు. ప్లాస్టిక్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 59 పాఠశాలలను నెట్ జీరో స్కూల్స్‌గా తీర్చిదిద్ది.. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించామన్నారు. శ్రీకాకుళం పట్టణంలో రూ.కోటి వ్యయంతో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ బోర్డును కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైకిల్ తొక్కడమనేది ఇంధన పొదుపు మాత్రమే కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే సైకిల్ తొక్కాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు

అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు




రూ. 1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..పోచంపల్లి నేతన్నలు అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అందుకే పోచంపల్లి 'సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించింది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు, వారి శ్రమకు తగిన ఆదాయం లభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతన్నలందరికీ అభినందనలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు తమ జీవనోపాధిని ఈ రంగంపైనే ఆధారపడి కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, ఉత్పత్తులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాలు వంటి భౌగోళిక గుర్తింపు (ఉఎ) పొందిన ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చేనేత కళ, నేతన్నల అపూర్వ నైపుణ్యం, సంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందన్నారు. ఇక్కడి నేతన్నలు ఇక్కత్, డబుల్ ఇక్కత్ పద్ధతుల్లో పత్తి, పట్టు, సికో వస్త్రాలను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.
ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

## భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

**తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్...హైదరాబాద్‌కు తరలింపు**

**వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు**

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

## పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

**పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి**

**కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం**

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం): ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా



మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ÷-లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపా÷-టం÷-మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## కోహెడ పండ్ల మార్కెట్‌కు నేడు సీఎం శంకుస్థాపన

గిట్టుబాటు ధర, ఆధునిక మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి ఉత్పత్తికి మార్కెట్ హామీ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడం, రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.వ్యవసాయ మార్కెటింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు దశాబ్దాల వరకు మార్కెట్ అవసరాలను తీర్చగలిగే విధంగా ఈ మార్కెట్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ ఇప్పటికే దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. 1962లో ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో 206 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 79 ఉప మార్కెట్ యార్డులు పనిచేస్తున్నాయని, ప్రతి సంవత్సరం సుమారు రూ.80 వేల కోట్ల విలువైన వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలు ఈ మార్కెట్ల ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ, మార్కెట్ల అభివృద్ధి, ధరల సమాచార ప్రచారం, రైతు బజార్ల నిర్వహణ, కనీస మద్దతు ధర కొనుగోళ్లకు అవసరమైన సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలను మార్కెట్ కమిటీలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ పండ్ల మార్కెట్ అభివృద్ధి ప్రయాణంలో జాంబాగ్, గడ్డిఅన్నారం, బాటసింగారం మార్కెట్లు కీలక పాత్ర పోషించాయని మంత్రి గుర్తు చేశారు. అయితే పండ్ల వ్యాపారం, రవాణా, వినియోగం గణనీయంగా పెరగడంతో ప్రస్తుతం ఉన్న సదుపాయాలు భవిష్యత్ అవసరాలకు సరిపోవని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే కోహెడాలో అత్యాధునిక సదుపాయాలతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.65 లక్షల మంది పండ్ల రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని 3,661 మంది పూల రైతులకు ప్రత్యేక పూల మార్కెట్ ద్వారా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారుల అవసరాలను ఒకే వేదికపై తీర్చగల సమగ్ర మార్కెట్ వ్యవస్థగా కోహెడా మార్కెట్ రూపుదిద్దుకోనుందని మంత్రి తెలిపారు.

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

**పార్లమెంట్ ఎంపీలు తిరుగుబాటు**

**అభిషేక్ బెనర్జీ నాయకత్వాన్ని వ్యతిరేస్తున్న ఎంపీలు**

కోల్‌కతా,జూన్5(సాక్ష్యం): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు




సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజుల్లా టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే రెబల్ ఎమ్మెల్యేలు పట్టు సాధించారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 57 మంది టీఎంసీలు ఎమ్మెల్యేలు ఇటీవల ఎన్నుకున్నారు. ఆ ఎన్నికను స్పీకర్ రతీంద్ర బోస్ కూడా గుర్తించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా బెనర్జీని గౌరవిస్తున్నామని చెబుతూనే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. తాజాగా టీఎంసీ ఎంపీల్లోనూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. అభిషేక్ బెనర్జీ పట్ల పలువురు అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పాటేందుకు వీరు చర్చలు జరుపుతున్నారని, 12 మందికి పైగా ఎంపీలు ఇందుకు సముఖంగా ఉన్నారని అంటున్నాయి. టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబ్రత బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటిరోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. దీనిపై వెటరన్ రాజ్యసభ ఎంపీ సుఖేందర్ శేఖర్ రాయ్ మాట్లాడుతూ, ఇంత తక్కువ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం ఎప్పుడూ చూడలేదని, అదే స్పందన లోక్‌సభలోనూ ఉండే అవకాశాలు లేకపోలేదని అన్నారు.

## స్పా సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు

**మల్కాజిగికి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు**

**113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు**

హైదరాబాద్,జూన్5(సాక్ష్యం):
నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి.
దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి.
దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడులు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్




అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

•

పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు



తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు.
గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

## ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్‌కు భరోసా

### – పర్యావరణ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ సత్య శారద పిలుపు



**వరంగల్, 05 జూన్ (సాక్ష్యం)**
ప్రకృతి సమస్త జీవరాశులకు జీవనాధారమని, ప్రకృతిని కాపాడితేనే అది మనలను కాపాడుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 10 వ థీమ్ లో శుక్రవారం 5 వ రోజు న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓ సిటీ నుండి జిల్లా




అధికారులు స్వచ్ఛంద సంస్థల చే ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ అయిన 'ప్రకృతి నుండి ప్రేరణ' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ర్యాలీ అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్



వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ జరుగు, దీని ప్రభావంతో వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. సునామీలు, క్లౌడ్‌బర్స్టులు, ఇతర విపత్తులు ప్రకృతిపై మానవ జోక్యం వల్లే ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా గ్రీన్ హైడ్రోజన్ వంటి పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పూర్వీకుల జీవన విధానం లా మట్టి కుండలు, మట్టి పాత్రలు వంటి ప్రకృతి అనుకూల వస్తువులను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు



పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ సునీత, రిటైర్డ్ డిఎఫ్ఓ పురుషోత్తం, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.

## బాకీ వివాదంలో ఇల్లుకు నిప్పు పెట్టిన నిందితుడు

### – ఇల్లు దగ్ధం, ప్రాణాపాయం నుండి బయటపడిన కుటుంబ సభ్యులు

**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ జూన్ 5:**
పైసలు బాకీ తీసుకున్న వివాదంలో చెలరేగిన మనసుపొర్థాలు ఇంటిని, కుటుంబ సభ్యులను దగ్ధం చేయాలనే ఆలోచనకు దారితీసింది. శుక్రవారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో జరిగిన సంఘటన గురించి ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పిప్పిరి గ్రామానికి చెందిన రాజమల్లు అను అతని వద్ద అదే గ్రామానికి చెందిన ఏ వన్ బోరు వ్యాపారం నిర్వహించే అబ్దుల్ భారీ అనే వ్యక్తి తన కుటుంబ అవసరాల నిమిత్తం 2019 సంవత్సరంలో ఐదు లక్షలు బాకీ తీసుకున్నాడని తీసుకున్న రూపాయల గురించి రాజమల్లు బారిని అడుగుతూ వచ్చాడని, అయితే ఆరు నెలల క్రితం ఐదు లక్షలు అసలు డబ్బులు ఇచ్చినాడని,వడ్డీ కింద రెండు లక్షల కొరకు ఎస్బిఐ బ్యాంక్ చెక్కు ఇచ్చి 8 నెలల తర్వాత డ్రా చేసుకోమని ఒప్పందం కుదుర్చుకున్నారని, కాగా ఒప్పందం ప్రకారం రాజమల్లు డబ్బులు అవసరం ఉండి ఈ రోజు బ్యాంకు కి వెళ్లి చెక్ వేసి లక్ష 75 వేల రూపాయలు డ్రా చేసుకో చేసుకున్నాడని సత్యనారాయణ గౌడ్ తెలిపారు. డబ్బులు డ్రా విషయంలో తలెత్తిన వివాదంతో అబ్దుల్ భారీ 35 లీటర్ల క్యాన్ లో పెట్రోల్ తీసుకొని వెళ్లి ఫిర్యాదు దారుడైన రాజమల్లు కుటుంబ సభ్యులను చంపాలని ఉద్దేశంతో పెట్రోలు వాళ్లపై పోసి, ఇంట్లో చల్లి అగ్గిపెట్టగా కుటుంబ సభ్యులు బయటకి పరుగులు తీయగా ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గంగ మల్లు తన భార్య , కూతురు త్రుటిలో ఖ తప్పించుకొని బయటపడ్డారని పేర్కొన్నారు. ఆ తర్వాత అబ్దుల్ బారి అన్న అబ్దుల్ బాబర్ వచ్చి ఎప్పటికైనా మిమ్మల్ని చంపేస్తామని బెదిరించినారని ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

### యుగంధర్ కుటుంబాన్ని

## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

**నర్సంపేట జూన్ 5 (సాక్ష్యం న్యూస్ ) :**
నర్సంపేట పట్టణానికి చెందిన నవభారత్ పాత్రికేయులు నాడెం యుగంధర్ మాతృ మూర్తి మే 26 న అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నాడెం సరోజన గారి పెద్దకర్మ కార్యక్రమానికి యుగంధర్ గృహానికి విచ్చేసి దివంగత నాడెం సరోజన గారి చిత్రపటానికి పూలమాలవేసి, శ్రద్ధాంజలి ఘటించారు. బాధితకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ మాతృమూర్తిని కోల్పోయిన నాడెం యుగంధర్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట



నియోజకవర్గ కన్వీనర్ తక్కల్లపల్లి రవీందర్ రావు, ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నాడెం శాంతి కుమార్, నాయకులు నల్ల మనోహర్ రెడ్డి, నాడెం నాగేశ్వర్, నాడెం శ్రీను, నాడెం రామకృష్ణ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### నాచారంలో ఘనంగా

## గుంటుక కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

### – శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మందముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జూన్ 5 (సాక్ష్యం):**
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్, నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర ఆలయ మాజీ చైర్మన్ గుంటుక కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉప్పల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు గుంటుక కృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించి జన్మదిన కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గుంటుక కృష్ణారెడ్డి కౌన్సిలర్‌గా పనిచేసిన కాలంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ముద్దసాని రామిరెడ్డి, బాలు యాదవ్, నవీన్, పసియుద్దీన్ తదితరులు పాల్గొని గుంటుక కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## గిన్నిస్ రికార్డు సాధించిన హల్లెల్ మ్యూజిక్ విద్యార్థులకు ఘన సన్మానం

### ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వరంగల్ రవి అభినందనలు

**సికింద్రాబాద్, జూన్ 5 (సాక్ష్యం):**
సంగీత రంగంలో అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు వరంగల్ రవి విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ రవి మాట్లాడుతూ, సంగీత రంగంలో తెలంగాణ విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన గిన్నిస్ అచీవ్‌మెంట్ మీట్‌లో 22 దేశాలకు చెందిన



సుమారు 2 వేల మంది కీబోర్డ్ వాద్యకారులు గంటపాటు నిరంతరాయంగా ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 777 మంది వాద్యకారులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తింపుతో సంస్థ సర్టిఫికెట్లు అందజేసింది. అనంతరం హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ అగస్టీన్ దండంగిని వరంగల్ రవి ప్రత్యేకంగా అభినందించారు.



ఎంతోమందికి ఉచితంగా సంగీత విద్యను అందిస్తూ ప్రతిభావంతులైన కళాకారులను తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు నరసింహ, కొమ్ము శేఖర్, జంగిలి దర్శన్, పాండు కురుమ, హల్లెల్ హైదరాబాద్ ఇన్‌చార్జ్ రేమ, ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డైసీ, జి. నరహరి, ఎవెలిన్ గీత, మోసెస్ దేవదాస్, డి. శివాని, అమూల్య, సాల్మన్ రాజ్, శామ్యూల్ రాజ్, జేశురన్, డానియల్ రాజ్, జోయల్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

### పాలకుర్తి మండల కేంద్రంలోనే

## ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేపట్టాలి

### – అందుబాటులో ప్రభుత్వ భూములు – ప్రభుత్వభూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు దుంపల సంపత్

**పాలకుర్తి,జూన్ 05(సాక్ష్యం):**
పాలకుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు దుంపల సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నాడు రజాకార్ వ్యవస్థ నుండి నేటి రాజకీయ వ్యవస్థ వరకు మండలంలో సరైన విద్యా విధానం లేదు. ప్రాంతేతరుల పాలన స్థానిక నాయకత్వ అసమర్థత, మండల విద్యార్థుల భవిష్యత్తు శాపంగా మారింది.కాలేజీ ల నిర్మాణం అంటూ ఎలక్షన్ మేనిఫెస్టో తో గెలిచిన నాయకులు తమ పిల్లల చదువులపై ఉన్న శ్రద్ధ పాలకుర్తి ప్రాంత ప్రజల పిల్లల భవిష్యత్తు పై లేకపోవడం దూరదృష్టకరం.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను స్వాగతిస్తూ, పాలకుర్తి మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా **ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ ని కోరుతున్నాం..**
మండల కేంద్రం లో మరియు వివిధ గ్రామాలలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నందున, సంబంధిత అధికారులు స్థల పరిశీలన నిర్వహించి తగిన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు,



వసతి సౌకర్యాలు మరియు మెరుగైన విద్యా అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని పాలకుర్తి మండలానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కమ్మగాని వెంకన్న పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ

## ప్రతిఒక్కరి బాధ్యత: పోతగాని గోపాల్ గౌడ్

**ఉప్పల్, జూన్ 5 (సాక్ష్యం):**
కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 12 సంవత్సరాల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టిన 'మాకే నాంపే ఏక్ పెడ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో శుక్రవారం విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'మాకే నాంపే ఏక్ పెడ్' కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. కన్నతల్లిని గౌరవించినట్లే ప్రకృతిని కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న కాలుష్యం, భూతాపం వంటి సమస్యల నుంచి మానవాళిని రక్షించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.గత 12 ఏళ్లలో మోడీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద కనీసం ఒక మొక్కను నాటి, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాలని ప్రజలకు, యువతకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొల్లం చంద్రమౌళి, బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం రాజిరెడ్డి, జవాజీ శ్రీధర్ రెడ్డి, గంధమల్ల గోపి, మోర నర్సింహారెడ్డి, చంద్రయ్య, వెంకటరెడ్డి, వెంకన్న, ఆంజనేయులు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**పాలకుర్తి,జూన్05 (సాక్ష్యం):** జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామ సర్పంచ్ పోషల వెంకన్న అధ్యక్షతన, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, గ్రామ ఉప సర్పంచ్ గంగరపు సరిత, వార్డు సభ్యులు తో కలిసి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్వాడీ టీచర్లు, మారి స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, ఆయాలు, గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### రిషి డాన్స్ అకాడమీలో

## సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు

### విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత





**కోదాడ జూన్ 05, (సాక్ష్యం)**
రిషి డాన్స్ అకాడమీలో సమ్మర్ క్యాంపు 45 రోజులు ముగింపు కార్యక్రమం శుక్రవారం చేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు హాజరై మాట్లాడారు. డ్యాన్స్ లో శిక్షణ పట్ల డ్యాన్స్ మాస్టర్ నాగేశ్వరరావును అభినందించారు. డ్యాన్స్ శిక్షణలో పాల్గొన్నవారికి సర్టిఫికెట్స్ అందజేశారు. మాస్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టబోయిన జ్యోతి శ్రీను, కేఆర్ కాలేజీ లెక్చరర్ వేముల వెంకటేశ్వర్లు, కొల్లు. క్షత్రియ, సీనియర్ నాయకులు గంధం పాండు, ఇంటి యజమాని వెంకటేశ్వర్లు, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### తొర్రూరు (జె) గ్రామ కాంగ్రెస్ పార్టీ

## జనరల్ సెక్రెటరీగా గోనె మహేందర్ రెడ్డి

**పాలకుర్తి,జూన్ 05(సాక్ష్యం):**
పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని తొర్రూరు గ్రామంలో, నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా గోనే మహేందర్ రెడ్డిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా, గోనె మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తన పై నమ్మకంతో, జనరల్ సెక్రెటరీగా, ఎందుకున్నందుకు మండల నాయకులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు...



## మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముదిరాజ్‌కు
# వ్యతిరేకంగా అంటించిన బ్యానర్లను ఖండించిన ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ

**హనుమకొండ 5 జూన్ (సాక్ష్యం)**
హైదరాబాద్‌లో బీజేపీ నేత, మాజీ మంత్రి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కట్టిన బ్యానర్లను వరంగల్ ఉమ్మడి జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మహాసభ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి చొప్పరి సోమయ్య మాట్లాడుతూ రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే బ్యానర్లు కట్టడం సరైన పద్ధతి కాదనీ తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పోషించిన పాత్రను గుర్తు చేస్తూ, ప్రజా నేతగా ఆయనకు గౌరవం ఇవ్వాల్సిందేనని అన్నారు. ఇలాంటి చర్యలు సమాజంలో చీలికలు తెస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మహాసభ ద్వారా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అర్బన్ జిల్లా అధ్యక్షులు బయ్య స్వామి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో గ్రామ గ్రామాన తిరుగుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో కృషి చేయడం జరిగిందని, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రులతో అసెంబ్లీలో పోరాడిన వ్యక్తి రాజేందర్ అని తెలిపారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ మాట్లాడుతూ ఇంటికి వచ్చిన ప్రతి కార్యకర్తను వారి బాగోగులు గుర్తించి వారికి అన్నం పెట్టి జాగ్రత్తగా ఇంటికి వెళ్లి రండి అని చెప్పి పంపించే వ్యక్తి రాజేందర్ అని, అటువంటి వ్యక్తిపై ఈ విధంగా అవహేళన పరచే విధంగా చేయడాన్ని తెలంగాణ ముదిరాజ్ మహా ఖండిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు బండి సారంగపాణి మాట్లాడుతూ బీజేపీలో ఉన్న కొంతమంది వ్యక్తులు పని కట్టుకొని ఈటెల రాజేందర్ ను అవమానపరిచే విధంగా ఫ్లెక్సీలు పెట్టడం మంచి పద్ధతి కాదని రాబోయే రోజులలో తన పైన ఎలాంటి అరాచకాలు చేపట్టిన ముదిరాజులందరూ పెద్ద ఎత్తున ధర్నాలు చేయవలసి వస్తుందని బిజెపి వాళ్లను హెచ్చరించడం జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఫ్లెక్సీలు కట్టిన వారిపై కేసు పెట్టినా ఇప్పటివరకు కూడా డీజీపీ




ఫ్లెక్సీ ల వివాదంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఫ్లెక్సీలు కట్టిన వారిని గుర్తించి వారిని సరియైన శిక్ష పడే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజకుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిల్ల సహదేవ్, భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు జోర్క సదయ్య, జనగాం జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు నీల రాజు, ములుగు జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు సాదు రఘు, కోరబోయిన రవి, గ్రేటర్ వరంగల్ నాయకులు పుట్ట మహేందర్, బయ్యా శోభన్, గ్రేటర్ వరంగల్ ఉపాధ్యక్షులు బిల్ల శివశంకర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సంగినేని భీమ్రాజ్, కంబాల కోటి, ఇతర ముదిరాజులు పాల్గొన్నారు.

## వహీద్ మృతి బాధాకరం
– దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**డిండి. సాక్షం న్యూస్ :**
మండల పరిధిలోని దాసరినెమిలిపూర్ గ్రామానికి చెందిన ఎండీ ఉస్మాన్ కుమారుడు వహీద్ మృతి బాధాకరం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన వహీద్ కుటుంబాన్ని హైదరాబాద్ బ్రాహ్మణపెల్లి లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వహీద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వహీద్ ఆత్మకు శాంతి చేకూరాలని, ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన వెంట, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఉప్పుగంటి ప్రశాంత్ రావు, రామచంద్రం, వాటర్ శీను, కొండల్ రెడ్డి, నరేందర్, భగవంతు, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

## దేవరకొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

**దేవరకొండ: జూన్ 5 (సాక్ష్యం)**
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం క్యాంపు అభినందనీయం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో మునుకుంట్ల వెంకట్ రెడ్డి . సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సందర్శించి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంపును ఏర్పాటు చేసిన మునుకుంట్ల వెంకట్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ



అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనంతరం క్యాంపు నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునికుంట్ల వెంకట్ రెడ్డి, స్థానిక ఉప సర్పంచ్ కడారి సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, అప్పనాల తిరుమల, గుండాల వెంకట్, మల్లేష్, పాల్గొన్నారు.

## తడి చెత్త - పొడి చెత్తపై అవగాహన సదస్సు
చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు

**కోదాడ జూన్ 05, (సాక్ష్యం)**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తడి చెత్త – పొడి చెత్తపై 20వ వార్డులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, కమిషనర్ రమాదేవి హాజరై మాట్లాడుతూ ర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను వర్గీకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన పట్టణాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. అలాగే చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మున్సిపాలిటీ తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్వరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్నేని బాబు, కౌన్సిలర్లు జె నాగేశ్వరరావు, గందం పాండు, మాజీ కౌన్సిలర్ ఖాజా, డీఈ లక్ష్మి, శానిటరీ ఎస్సై సురేష్, సిహెచ్ రాజయ్య, భవాని, సీఓ వెంకన్న, సీతారాణి, మాణిక్యం, మహిళలు, అధికారులు,








ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

**మంగపేట, జూన్ 05, (సాక్ష్యం) :**
మంగపేట మండలంలో పలు గ్రామాలలో బీఆరెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమరి లక్ష్మీనర్సింహారావు శుక్రవారై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. గ్రామాలలో అకాల మృత్యవాత పడిన కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన అధినాయకుడు కేసీఆర్ ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే నాయకులను, నిరంతరం ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉండే వారినే గుర్తిస్తారని, వారికే రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయి పదవులను ఇస్తారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు తమలోని ప్రతిభను, పనితనాన్ని నిరుపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేదు పార్టీలో ఎలాంటి గ్రూపులు ఉండవని, ఉండకూడదని ఆయన కరాఖండిగా చెప్పారు.



మనది ఒకటే గ్రూప్ అది బీఆర్ఎస్ పార్టీగా అందరం కలిసికట్టుగా ఒకే తాటిపై నడవాలని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా అధినాయకత్వ నిర్ణయానికి కట్టుబడాలి మన నియోజక వర్గంలో కేసీఆర్ ఎవరికి టికెట్ కేటాయించినా, వ్యక్తిగత పట్టింపులు పక్కనపెట్టి, తలవంచి పార్టీ అభ్యర్థి విజయం కోసం సైనికుల్లా పనిచేయడమే మన అందరి ఏకైక లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. త్వరలోనే సభ్యత్వ నమోదు ప్రారంభం పార్టీని కింది స్థాయి నుండి మరింత బలంగా నిర్మించుకోవడానికి త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాబోతుందని ఆయన ప్రకటించారు. కేసీఆర్ మాటను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా విజయవంతం చేయాలని కోరారు. కింది స్థాయి వరకు పార్టీ సిద్ధాంతాలు, వివరణలు స్పష్టంగా వెళ్ళినప్పుడే సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయపర్తి రోడ్లకు
# మహర్దశ రూ 5.50 కోట్లతో సమగ్ర అభివృద్ధి
– మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం – పాలకూర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**రాయపర్తి, జూన్ 5(సాక్ష్యం):**
గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని పాలకూర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. రాయపర్తి మండల పరిధిలో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి ఈరోజు ఘనంగా శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో శుక్రవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. రాయపర్తి మండలం లోని కొండూర్ గ్రామంలో ఆర్‌డబి రోడ్డు నుండి భోజ్యా తండా వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులను ఎస్‌టిఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా చేపడుతున్నట్లు




ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ. 243.44 లక్షల వ్యయం మంజూరైనట్లు వెల్లడించారు. బీటీ రోడ్డు, పోతురెడ్డిపల్లి నుండి వాంకుడోత్ తండా వరకు రూ. 1 కోటి 51 లక్షల 26 వేల వ్యయంతో బీటీ రోడ్డు, సూర్య తండా పీఆర్ రోడ్ నుండి గుగులోత్ చక్రు తండా వరకురూ. 40 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు, ఏకే తండా శివారు రేగడి తండా నుండి రావూరి తండా క్రాస్ రోడ్ వరకు రూ. 1 కోటి 42 లక్షల 35 వేల వ్యయంతో బీటీ రోడ్డు పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ బిటి రోడ్డు నిర్మాణంతో తండాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, రైతులు, ఉద్యోగులకు, ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత



గడువులో పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. అనంతరం రాయపర్తి ఎంపీడీఓ ఆఫీస్ లో కల్యాణ లక్ష్మి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 25మంది లబ్ధిదారులకు 25లక్షల 2వేల 900రూ చెక్కులు



అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుదీర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మాచర్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ రెంటాల గోవర్ధన్ రెడ్డి, నాయకులు పాల్వంచ కోటేశ్వర్, మైనార్టీ నాయకులు ఎండీ నయిం , చెవ్వ కాశినాదం, మహిళా నాయకురాలు కాంచనపల్లి వనజరాణి సర్పంచులు రాయిని యాకన్న, రెడ్డి నాయక్, బానీషా నాయక్, స్వప్నసంతోష్, సోమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణకు
# ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, జూన్ 5 (సాక్ష్యం):**
భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మైసమ్మ ఆలయ పరిసరాల్లో, ప్రధాన రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యత: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో, వర్షపాతం పెరగడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగితే ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు ఏర్పడి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# పచ్చిరొట్టతోనే పంటకు దిగుబడి
– రసాయనాలతో తగ్గుతున్న భూసారం – పచ్చిరొట్ట సాగుతోనే సేంద్రియ పోషకాలు – విత్తనాలపై 50 శాతం ప్రభుత్వ రాయితీ

**రాయపర్తి, జూన్ 5(సాక్ష్యం):**
ఖరీఫ్ పంటకు ముందు పచ్చి రొట్టె సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా, భూమికి అవసరమైన పోషకాలు అందుతాయని రాయపర్తి వ్యవసాయా ధికారి గుమ్మడి వీరభద్రం వివరించారు. రబీ వరి కోతలు పూర్తి అయినా తరుణంలో రైతులు పచ్చిరొట్ట సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. విపరీతమైన రసాయన ఎరువుల వాడకంతో నేల సారం తగ్గిపోతున్న నేపథ్యంలో, భూమికి తిరిగి జీవం పోయడానికి పచ్చిరొట్ట ఎరువులు అత్యుత్తమ ప్రత్యామ్నాయమని చెబుతున్నారు. మండల వ్యాప్తంగా రాబోయే ఖరీఫ్ సుమారు 24వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అంచనా. వర్షాలు లేకుంటే 18నుంచి, 20ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే, రసాయన ఎరువుల మితిమీరిన వాడకంతో మట్టిలో సూక్ష్మజీవుల సంఖ్య గణనీయంగా పడిపోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు గ్రాము మట్టిలో కోట్లాదిగా ఉర్డే సూక్ష్మజీవులు ఇప్పుడు లక్షలకు పడిపోయాయి. దీనివల్ల నేల సారం తగ్గి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. మట్టిలో సూక్ష్మజీవులు తిరిగి వృద్ధి చెందాలంటే పచ్చిరొట్ట సాగే సరైన మార్గం. వరి కోతలు పూర్తయిన వెంటనే విత్తనాలు చల్లుకోవ డానికి ఇదే అనువైన సమయం. ఖరీఫ్, రబీ సీజన్ల మధ్య వ్యవధిలో జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి తదితర రకాలను సాగు చేసుకోవాలి. ఇవి పూత దశకు చేరుకోగానే ప్రధాన పంట వేసే ముందు ఆ పైరును భూమిలో కలియదున్నాలి అని వివరించారు. ఒకసారి పచ్చి రొట్ట వేసిన రైతులు మరుకటి ఏడు తప్పక వాడుకుంటారని తెలిపారు.





# లార్డ్స్‌లో న్యూజిలాండ్ 113కే ఆలౌట్..

లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మొదటి టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌట్ కాగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది. 65/6తో రెండో రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయింది. ఫిలిప్స్ అవుటయినప్పటికీ న్యూజిలాండ్ టెయిలెండర్స్ రాణించడం విశేషం. కైల్ జెమీసన్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. ఈ టెస్టులో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్ 140 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ కూడా అదే జోష్‌తో న్యూజిలాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది. తొలి రోజే ఇరు జట్లు 16 వికెట్లు కోల్పోయింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 65/7తో ముగించింది. రెండో రోజు ఆట ప్రారంభమైన తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయాడు. ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ తొలి బంతికే ఫిలిప్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 80 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసుకున్న జెమీసన్.. బ్యాట్‌తో కూడా రెచ్చిపోవడంతో న్యూజిలాండ్ 100 పరుగులు దాటేసింది. జెమీసన్‌కు తోడు నాథన్ స్మిత్ కూడా రాణించాడు. ఆఖర్లో వరుస వికెట్లు పడటంతో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోర్‌కు 27 పరుగుల దూరంలో కివీస్ ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోర్ 65/7 స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కి వచ్చిన న్యూజిలాండ్ జట్టు తొలి సెషన్‌లోనే ఆలౌట్ అయింది. గ్లెన్ ఫిలిప్స్ 65 పరుగుల వద్ద అవుటైన తర్వాత న్యూజిలాండ్ టెయిలెండర్స్ 48 పరుగులు జోడించడం విశేషం. కైల్ జెమీసన్ 29 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, ఇంగ్లండ్ బౌలర్లకు కాసేపు చెమటలు పట్టించాడు. అవతలి ఎండ్‌లో మరో బ్యాటర్ నిలబడినా మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ లీడింగ్‌లోకి వచ్చేసేది. విలియమ్ ఓరూర్క్ 1, మ్యాట్ హెన్రీ డకౌట్ కావడంతో 113 పరుగులకే ఆలౌట్ కావాల్సి వచ్చింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్ ఐదు వికెట్లు తీసుకోగా, జోష్ టంగ్ మూడు వికెట్లు పడగొట్టాడు. గస్ అట్కిన్సన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. పేసర్లకే మొత్తం పది వికెట్లు దక్కడం విశేషం. కివీస్ 113 పరుగులకే ఆలౌట్ కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 27 పరుగుల ఆధిక్యం సాధించింది.

## ఘోరంగా విఫలమైన లివింగ్ స్టోన్

ఐపీఎల్ 2026 మెగా వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ ఇంగ్లాండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌ను ఏకంగా రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. మిడిల్ ఆర్డర్‌లో అతడు సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్రాంచైజీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ, తీరా ఐపీఎల్ 2026 సీజన్ ముగిసేసరికి కావ్య మారన్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంత పెద్ద తప్పో అర్థమైందని క్రికెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సీజన్‌లో లివింగ్ స్టోన్ ఘోరంగా విఫలమయ్యాడు. సన్‌రైజర్స్ తరఫున కేవలం రెండంటే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే అతడికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ఆ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అతడు చేసింది కేవలం 15 పరుగులు మాత్రమే. మిగిలిన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్న వేళ లివింగ్ స్టోన్ తడబడటంతో, మేనేజ్‌మెంట్ అతడిని మిగతా మ్యాచ్‌లన్నింటికీ బెంచ్‌కే పరిమితం చేయాల్సి వచ్చింది. అయితే ఐపీఎల్ ముగిసిన తర్వాత లివింగ్ స్టోన్ సన్ రైజర్స్ హైదరాబాద్‌పై సంచలన కామెంట్స్ చేశాడు. తమ తుది జట్టు



ఎంపికలో యాజమాన్యం జోక్యం ఉంటుందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు. అతడికి వేలంలో దక్కిన ధర (రూ. 13 కోట్లు), అతడు చేసిన పరుగులను (15 రన్స్) పోల్చి చూస్తూ సోషల్ మీడియాలో నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. దాదాపు ఒక్కో పరుగుకు కోటి రూపాయల చొప్పున లివింగ్ స్టోన్ వసూలు చేశాడంటూ కామెంట్లు పెడుతున్నారు. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ఇతడిని వచ్చే సీజన్ కోసం జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ తదుపరి మినీ వేలానికి ముందే అతడిని జట్టు నుంచి విడుదలచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆ రూ. 13 కోట్ల పర్స్ మనీతో వేలంలో మరొక మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కొనుగోలు చేయవచ్చని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం.



## జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి రాహుల్

న్యూచండీగఢ్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడారు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్టు కలయికపై ఆయన కొన్ని కీలక సంకేతాలు ఇచ్చారు. ఆ సూచనల ఆధారంగా అఫ్గానిస్తాన్‌తో తలపడే భారత్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారతదేశం తరఫున అత్యుత్తమ స్థానంలో ఉన్న ఈ యువ ఓపెనర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయమైంది. జైస్వాల్‌తో కలిసి రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌కు అతడిని టీమిండియా వైస్ కెప్టెన్‌గా కూడా మేనేజ్‌మెంట్ నియమించింది. ఎడమచేతి వాటం బ్యాటర్ సాయి సుదర్శన్ నంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని కోచ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ఐపీఎల్ 2026లో 722 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్, అదే జోరును టెస్టుల్లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు. జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన రెగ్యులర్ స్థానమైన నంబర్ 4లో బ్యాటింగ్‌కు రానున్నాడు. మెడ గాయం కారణంగా గువాహటిలో సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్టుకు దూరమైన గిల్.. ఇప్పుడు పూర్తిగా కోలుకుని జట్టులోకి పునరాగమనం చేస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నంబర్ 5లో బరిలోకి దిగనున్నాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగే ఈ మ్యాచ్ పంత్‌కు కెరీర్‌లో 50వ టెస్ట్ కావడం విశేషం. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. బ్యాట్, బాల్ రెండింటితోనూ రాణించాలని ఈ యువ ఆటగాడు చూస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుందర్ తుది జట్టులో ఉంటాడు. విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే.. మానవ్ సుతార్‌ను కాదని న్యూచండీగఢ్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. ఐపీఎల్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, కుల్దీప్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. రవీంద్ర జడేజా అందుబాటులో లేకపోవడంతో భారత స్పిన్ విభాగాన్ని అతడే ముందుండి నడిపించనున్నాడు. భారత పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడే కావడం గమనార్హం. పంజాబ్ అన్‌క్యాప్డ్ పేసర్ గుర్నూర్ బ్రార్ కంటే ప్రసిద్ధ్ కృష్ణకే తుది జట్టులో ఎక్కువ అవకాశం ఉంది. సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు.

టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ



## వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!

భారత బ్యాటింగ్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులకు గట్టి షాక్ ఇచ్చారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ మొత్తానికి ఆయన దూరమయ్యారు. ఈ విషయాన్ని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ గురువారం (జూన్ 4) వెల్లడించింది. ఇటీవల ఆదివారం (మే 31) జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గుజరాత్ టైటాన్స్‌పై 42 బంతుల్లో 75 పరుగులు చేసి ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు గెలుచుకున్న 37 ఏళ్ల కోహ్లీ.. అదే మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్‌తో భారత్ ఆడబోతున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆయన భాగం కాలేకపోతున్నారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరం కావలసి వచ్చింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లోనే ఆయనకు ఈ గాయమైంది. స్కానింగ్ రిపోర్టులలో ఆయనకు ‘డిస్టల్ సెమీమెంబ్రానోసస్ టెండన్ టియర్’అయినట్లు తేలింది” అని బీసీసీఐ వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. ఇది మోకాలి వెనుక భాగం కింద ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరాలను అనుసంధానించే దట్టమైన నరానికి సంబంధించిన ఒక అరుదైన గాయం. అయితే కోహ్లీ గాయంపై మరియు సిరీస్ నుండి ఆయన తప్పుకోవడంపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ దూరం కావడంతో ఆయన స్థానంలో యశస్వి జైస్వాల్ లేదా రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. న్యూజీలాండ్‌తో జరిగిన గత వన్డే సిరీస్‌లో జైస్వాల్ జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. మరోవైపు గైక్వాడ్ గత ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నాడు. అయితే, ప్రస్తుతం గైక్వాడ్ శ్రీలంకలో జరగబోయే త్రైపాక్షిక సిరీస్ కోసం ‘ఇండియా ఎ’ జట్టులో ఉన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను మే 19నే ఈ చారిత్రక హోమ్ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అయితే ఐపీఎల్ 2026లో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడిన రోహిత్.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడనే నిబంధనతో జట్టులోకి తీసుకున్నారు. ఆయన ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా చూడాల్సి ఉంది.

భారత్–ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్ షెడ్యూల్: మొదటి వన్డే: జూన్ 13 (శనివారం) -- ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం). రెండవ వన్డే: జూన్ 17 (బుధవారం) -- లక్నో (భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం). మూడో వన్డే: జూన్ 20 (శనివారం) -- చెన్నై (చెపాక్)

## శ్రీలంకలో అడుగుపెట్టిన ఇండియా-ఏ టీమ్..

### భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ మధ్య ట్రై సిరీస్

శ్రీలంక వేదికగా ఓ ట్రై సిరీస్‌ను బీసీసీఐ ప్లాన్ చేసింది. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల ‘ఏ’ జట్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. జూన్ 9 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ జూన్ 21 వరకు సాగుతోంది. ఈ సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మీదే ఉంది. ఈ సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక గడ్డపై అడుగుపెట్టాడు.



ఐపీఎల్ 2026లో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల వైభవ్.. ఇప్పుడు ఇంటర్నేషనల్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంక వేదికగా జరగనున్న ట్రై సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంక చేరుకుంది. మొత్తం ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొంటున్నాయి. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య ట్రై సిరీస్ జరగనుంది. ఈ మూడు దేశాల ఏ కేటగిరి జట్లు ఈ ట్రై సిరీస్‌లో పాల్గొంటున్నాయి. ఈ సిరీస్‌కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్ రానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ కోసం యువ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇండియా ఏ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. వైస్ కెప్టెన్‌గా ఎంపికైన రియాన్ పరాగ్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశారు. బీసీసీఐ చెప్పిన ప్రకారం వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లు దంబుల్లాలో జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఇండియా – ఏ, శ్రీలంక – ఏ జట్ల మధ్య రెండు రోజుల రెడ్ బాల్ మ్యాచ్‌లు గాలేలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు.

# కోహ్లీకి భారత్‌లో ఉండటం ఇష్టం లేదు

### ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్

టీమిండియా స్టార్ బ్యాటర్, ఆర్‌సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీకి భారత్‌లో ఉండటం ఇష్టం లేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్, ఇంగ్లండ్ మాజీ



ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్ అన్నాడు. ప్రశాంతమైన జీవితాన్ని విరాట్ కోహ్లీ కోరుకుంటున్నాడని, కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపాలనుకుంటున్నాడని చెప్పాడు. దాంతోనే లండన్‌లో సెటిల్ అయ్యాడని తెలిపాడు. ప్రస్తుతం భారత్‌తో తాను గడుపుతున్న జీవితాన్ని కోహ్లీ పెద్దగా కోరుకోవడం లేదని, అందరి కళ్లూ ఎప్పుడూ తనపైనే ఉండాలని అతను అస్సలు అనుకోదని స్పష్టం చేశాడు. విరాట్ కోహ్లీ చాలా మంచి వ్యక్తి అని చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీకి ప్రాతినిధ్యం వహించిన లియామ్ లివింగ్ స్టోన్.. తాజా సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఆడాడు. ఇటీవలే ఐపీఎల్ ముగియడంతో స్వదేశానికి వెళ్లిన లివింగ్ స్టోన్.. అక్కడ ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లతో కలిసి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా కోహ్లీపై ప్రశంసల జల్లు కురిపించాడు. ‘విరాట్ కోహ్లీ అద్భుతమైన వ్యక్తి. నేను ఎప్పుడూ అతనికి ప్రత్యర్థిగానే ఆడాను. కోహ్లీ ఎప్పుడూ నవ్వుతూనే కనిపిస్తాడు. అతనితో గొడవకు దిగాలనుకుంటే అతను కూడా అదే రీతిలో బదులిస్తాడు. కానీ మైదానంలో మాత్రం అత్యంత పోటీతత్వంతో ఉంటాడు. విరాట్ కోహ్లీ.. బౌండరీ లైన్ దాటి మైదానంలో అడుగుపెట్టగానే భిన్నమైన వ్యక్తిగా మారిపోతాడు. కానీ మైదానం బయట అతను చాలా మంచి వ్యక్తి. చాలా ప్రశాంతంగా ఉంటాడు. తన కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడిపేందుకు ఇష్టపడుతాడు. చాలా ప్రశాంతమైన స్వభావం ఉన్నప్పటికీ.. భారత్‌లో ఉండేందుకు కోహ్లీ ఇష్టపడటం లేదు. ప్రస్తుతం భారత్‌లో అతను గడుపుతున్న జీవితాన్ని కోహ్లీ కోరుకోవడం లేదు. అందరి కళ్లూ ఎప్పుడూ తనపైనే ఉండాలని అతను అస్సలు అనుకోడు. అందుకే లండన్‌లో సెటిల్ అయ్యాడు. అతను నిజంగానే చాలా మంచి వ్యక్తి. మైదానంలో నేను చూసిన ఆటగాళ్లలో అత్యంత పోటీతత్వం కలిగిన ప్లేయర్ విరాట్ కోహ్లీ మాత్రమే. ఆర్‌సీబీ కోచింగ్ స్టాఫ్ మొబాట్, ఆండీ ఫ్లవర్ విరాట్ కోహ్లీ ఆడే విధానాన్ని మార్చారు. ఈ మార్పు చేయడానికి వారు ఎంతో సాహసం చేశారు. కొంచెం దూకుడుగా ఆడాలని, ఎక్కువ సిక్సర్లు కొట్టాలని కోహ్లీ సూచించాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాలని చెప్పారు. దాంతో కోహ్లీ ఆటతీరు పూర్తిగా మారిపోయింది. గతానికి భిన్నంగా కోహ్లీ దూకుడుగా ఆడుతున్నాడు. స్పిన్ బౌలింగ్‌లోనూ భారీ షాట్స్ ఆడుతున్నాడు.’అని లివింగ్ స్టోన్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ తన కుటుంబంతో లండన్‌లో సెటిల్ అయిన సంగతి తెలిసిందే. తన కొడుకు అకాయ్ కోహ్లీ



కూడా అక్కడే జన్మించాడు. విరాట్ కోహ్లీ లండన్ పౌరసత్వం తీసుకోబోతున్నాడనే ప్రచారం కూడా జోరుగా సాగింది. వ్యక్తిగత స్వేచ్ఛ, మీడియా హైప్ నుంచి తన పిల్లలను రక్షించుకునేందుకు విరుష్క దంపతులు లండన్‌ను తమ నివాస స్థలంగా ఎంచుకున్నారు. దాంతోనే వన్డే క్రికెట్, ఐపీఎల్ ఆడే సమయంలో మాత్రమే కోహ్లీ భారత్‌కు వస్తున్నాడు.

# రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ ఆడగలడా..?

ఇంగ్లండ్ పేసర్ రాబిన్సన్ నిప్పులు చెరిగాడు. తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో రాబిన్సన్ ఈ ఫీట్ సాధించాడు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఫస్ట్ ఓవర్‌తోనే రాబిన్సన్ ఆకట్టుకున్నాడు. మెయిడిన్ ఓవర్‌తో పాటు మూడు కీలక వికెట్లు తీసాడు.

రాబిన్సన్ ప్రదర్శనను చూసిన క్రికెట్ అభిమానులు.. వైభవ్ సూర్యవంశీని తెరపైకి తీసుకొచ్చారు. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా? అనే చర్చకు తెరలేపారు. వర్షం కారణంగా ఈ టెస్ట్ మ్యాచ్‌కు కాసేపు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కండిషన్స్ స్వింగ్‌కు అనుకూలించడంతో రాబిన్సన్ చెలరేగాడు. తొలి రెండు బంతులను డాట్ చేసిన అతను.. మూడో బంతిని డేవాన్ కాన్వేను ఔట్ చేశాడు. నాలుగో బంతిని డాట్ చేయగా.. ఐదో బంతికి కేన్ విలియమ్సన్ వెనుదిరిగాడు. ఆరో బంతికి రచిన్ రవీంద్రను పెవిలియన్ చేర్చి న్యూజిలాండ్‌ను కోలుకోలేని దెబ్బతీసాడు. మూడు వికెట్లతో పాటు మెయిడెన్ ఓవర్ వేసి ఇంగ్లండ్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. ఈ ఓవర్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే ఆసక్తికర ప్రశ్న తెరపైకి వచ్చింది. ఇలాంటి అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌ను 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆడగలడా? అనే చర్చ మొదలైంది. ‘వైభవ్ ఇలాంటి స్వింగ్ కండిషన్స్‌లో నిలబడటం కష్టమే’ అని కొందరు అంటే.. మరికొందరు అతను ఇంకా భారత జట్టుకు ఆడలేదని, ఇలాంటి కఠిన పరిస్థితుల్లో ఎలా ఆడతాడో అంచనా



వేయడం సరికాదని కామెంట్ చేశారు. ఐపీఎల్‌లో వరల్డ్ క్లాస్ బౌలర్లు అయిన బుమ్రా, భువనేశ్వర్ కుమార్, రబాడ, జోష్ హేజిల్ వుడ్, మిచెల్ స్టార్క్‌లను చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీకి రాబిన్సన్ పెద్ద లెక్క కాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఐపీఎల్ ఆడినంత సులువు టెస్ట్ క్రికెట్ కాదని ఇంకొందరు కామెంట్ చేస్తున్నారు. బౌలర్లు రాజ్యమేలుతున్న ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌటవ్వగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్‌లో హ్యారీ బ్రూక్(56) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. న్యూజిలాండ్‌లో కైల్ జెమీసన్(38 నాటౌట్), గ్లేన్ ఫిలిప్స్(34) టాప్ స్కోరర్లుగా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జెమీసన్(5/62) ఐదు వికెట్లు తీయగా.. ఇంగ్లండ్ రాబిన్సన్(5/39) ఈ ఫీట్ సాధించాడు. 27 ప రుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నిలకడగా ఆడుతోంది.

# నాగ చైతన్య, విక్రమ్ కె కుమార్, శరత్ మారార్, అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, అమెజాన్ ప్రైమ్ 'దూత 2' కింగ్ నాగార్జున క్లాప్ తో ఘనంగా ప్రారంభం

యువ సామ్రాట్ నాగచైతన్య అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'దూత'తో ఓటీటీలో సంచలన అరంగేట్రం చేశారు. 'దూత' ప్రపంచ వ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించింది. ఈ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ పలు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రేక్షకులను ఆకట్టుకుని గ్లోబల్ ఫెనామెనాన్‌గా నిలిచింది. తొలి సీజన్ నాగచైతన్యకు డిజిటల్ ప్రేక్షకుల్లో మరింత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, నటుడిగా ఆయనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీతో తన అనుబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, నాగచైతన్య సీక్వెల్ కోసం నిర్మాతగానూ మారుతున్నారు. శరత్ మరార్‌తో కలిసి అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మిస్తున్నార. మొదటి సీజన్‌కు ప్రధాన బలంగా నిలిచిన తన అద్భుత కథన శైలితో విక్రమ్ కె కుమార్ రెండో సీజన్‌కు దర్శకత్వం వహించను న్నారు. ఈ ప్రాజెక్ట్‌ను నేడు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కింగ్ నాగార్జున అక్కినేని క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు. తండేల్' బ్లాక్‌బస్టర్ విజయానంతరం 'వృషకర్మ' చేస్తున్న నాగచైతన్య తన తదుపరి ప్రధాన ప్రాజెక్ట్‌గా 'దూత 2'ను ఎంచుకోవడం విశేషం. అంతేకాక నిర్మాతగా కూడా భాగస్వామి కావడం, ఈ కథపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని తెలియజే స్తోంది. ఈసారి విక్రమ్ కె కుమార్ మరింత ఉత్కంఠభరితమైన, మిస్టరీతో నిండిన కథను సిద్ధం చేశారు. మొదటి సీజన్‌ను మించిన స్థాయిలో సస్పెన్స్, సైకాలజికల్ థ్రిల్స్, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనున్నారు. ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తున్నారు. 'సుజల్: ది వోర్టెక్స్' తొలి సీజన్‌కు పనిచేసిన వి. ముకేశ్వరన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఈషాన్ ఛాబ్రా సంగీతం సమకూరుస్తున్నారు. ప్రవాల్య డి ప్రొడక్షన్ డిజైనర్‌గా, అనూష పుంజాల కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో మరింత భారీగా, ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న 'దూత 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.






## దుల్కర్ సల్మాన్ లాంచ్ చేసిన సందీప్ కిషన్, జేసన్ సంజయ్, ఎస్. తమన్, లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ ప్రజెంట్స్"సిగ్మా" ఎనర్జిటిక్ ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్

సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా'. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ సెన్సేషన్ ఎస్. తమన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. తాజాగా హీరో దుల్కర్ సల్మాన్ 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ 'సిగ్మా స్టైల్' ను లాంచ్ చేశారు. తమన్ స్వయంగా కంపోజ్ చేసి ఆలపించిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్ మాస్ బీట్‌లతో అదిరిపోయింది. థమన్ సిగ్నేచర్ స్టైల్ మ్యూజిక్, హై-వోల్టేజ్ రిథమ్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందీప్ కిషన్ తన స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, ఫారియా అబ్దుల్లా కూడా టు అదిరిపోయే డ్యాన్స్ స్టెప్స్‌తో పాటకు మరింత కలర్ తీసుకొచ్చింది. జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్, థమన్ మాస్ ట్యూన్, సందీప్-ఫారియా డైనమిక్ పెర్ఫార్మెన్స్ కలిసి 'సిగ్మా స్టైల్'ను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. ఈ సాంగ్‌తో సినిమాపై క్యూరియాసిటీ, ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి. ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించను న్నారు. ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. హరిహరసుతన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. చిత్ర ఆడియో హక్కులను సరేగమా సొంతం చేసుకోగా, డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సిగ్మా ప్రపంచవ్యాప్తంగా జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా 'స్లమ్ డాగ్' టీజర్ జూన్ 8న రిలీజ్

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా 'స్లమ్ డాగ్' ఈ చిత్రం ప్రొడక్షన్ విజయవంతంగా పూర్తయింది. అన్ని భాషా వెర్షన్లలో పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. '33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్ తో ఈ ప్రాజెక్ట్ దాని టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్-లుక్ విడుదల నుండి హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'స్లమ్ డాగ్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోల్లా జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించారు. నిర్మాతలు ఇప్పుడు నెక్స్ట్ ఫేజ్ ప్రమోషన్ల కోసం సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం టీజర్‌ను జూన్ 8న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. టీజర్ పోస్టర్‌లో కనిపించిన విజువల్ ఎంతో డార్క్ అండ్ ఇంటెన్స్‌గా ఆకట్టుకుంటోంది. కళ్లకు గంతలు కట్టుకున్న ఓ వ్యక్తి మెడపై రక్తంతో తడిసిన కట్టి ఉంచిన దృశ్యం కథలోని బ్రూటల్ ప్రపంచాన్ని సూచించేలా కనిపిస్తోంది. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తుండగా, టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న జాతీయ అవార్డు విజేత హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలం చేకూర్చనుంది. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.



# పెద్ది రామ్ చరణ్ కెరీర్ బెస్ట్

**అద్భుతమైన స్థాయిలో ఓపెనింగ్స్ వచ్చాయి ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు**

**'పెద్ది' బాక్సాఫీస్ ఛాంపియన్ ప్రెస్ మీట్‌లో నిర్మాత వెంకట సతీష్ కిలారు**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'బాక్సాఫీస్ ఛాంపియన్' సక్సెస్ ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. పెద్ది బాక్సాఫీస్ ఛాంపియన్ ప్రెస్ మీట్ లో నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. 'పెద్ది' చిత్రం అద్భుతంగా దూసుకుపోతోంది. తొలి రోజే ₹135 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన చాలా అద్భుతంగా ఉంది. సినిమా చూసిన వారందరూ ఇది చాలా మంచి సినిమా అని అభినందిస్తున్నారు. ఇది నిజంగా బ్రహ్మాండమైన సినిమా. అందరూ తమ పిల్లలను తీసుకుని థియేటర్లలో సినిమా చూడండి. ఇది రామ్ చరణ్ గారి కెరీర్‌లో బెస్ట్ సినిమా. ఆ స్థాయిలో ఓపెనింగ్స్ వచ్చాయి. టికెట్ రేట్ల విషయంలో మాకు సహకరించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు ప్రత్యేక ధన్యవాదాలు. భారీ స్థాయిలో, అత్యంత గ్రాండ్‌గా ఈ సినిమాను నిర్మించాం. ఆ కృషికి ప్రభుత్వాలు ఎంతో సానుకూలంగా స్పందించాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, మంత్రి కందుల దుర్గేష్ గారికి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి మరోసారి కృతజ్ఞతలు. చాలా కీలక సమయంలో వారు మాకు అండగా నిలిచారు. ఈ సినిమాను ప్రేక్షకులు చాలా దూరం తీసుకెళ్లారు. అందరూ సినిమాను నమ్మి అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టారు. మీడియా కి ధన్యవాదాలు. ఒక మంచి సినిమాకు మీరందరూ అండగా నిలిచారు. సినిమా గురించి అందరూ చాలా బాగా రాశారు. ఒక్క నెగెటివ్ లేకుండా పాజిటివ్‌గా ఆదరించారు. రామ్ చరణ్ గారికి, బుచ్చిబాబు గారికి మరోసారి ధన్యవాదాలు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నేను చేసిన తొలి సినిమాకే ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చినందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. అందరికీ థాంక్యూ సో మచ్.






## 'సోల్ ఆఫ్ లెనిన్'కి థియేటర్లలో అద్భుతమైన స్పందన.. జూన్ 26న 'మనోడు వస్తున్నాడు'

మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్'. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలలో నటించిన ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో అంచనాలు మరింతగా పెంచేశాయి. ఇటీవల మేకర్స్ 'సోల్ ఆఫ్ లెనిన్' అంటూ ఆడియెన్స్‌ని సర్ ప్రైజ్ చేశారు. 'పెద్ది' సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. 'పెద్ది' ప్రదర్శనలకు ఈ 'సోల్ ఆఫ్ లెనిన్'ను జోడించారు. ఈ ఉద్వేగభరితమైన, పవర్ ఫుల్ పాటకు బ్లాక్‌బస్టర్ స్పందన లభించింది. సినీ లవర్స్ ఈ పాట, అందులోని క్లిప్స్‌ను ఆన్‌లైన్‌లో షేర్ చేస్తూ అద్భుతంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఈ పాటలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే ప్రేమ, వారి బాండింగ్‌ను చక్కగా చూపించారు. 'ప్రేమ కంటే గొప్ప యుద్ధం లేదు' అనే క్యాప్షన్‌తో ఈ పాట సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రేమ కోసం అఖిల్ చేసే పోరాటం, భాగ్యశ్రీ ఆకట్టుకునే నటన ఈ పాటకు మరింత అదనపు ఆకర్షణను జోడించాయి. థమన్ స్వరపరిచిన ఈ పాట ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం, వాగ్దేవి గాత్రం ఈ పాటను మరింత అందంగా మలిచాయి. ఈ పాటలోని ప్రతి ఫ్రేమ్, ప్రతి విజువల్ భావోద్వేగాలతో కూడిన ఒక కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుందని హామీ ఇస్తున్నాయి. అఖిల్ మాస్ అప్పీల్, యాక్టింగ్, ఎమోషన్స్ అన్నీ కూడా ఈ పాటలో కనిపిస్తున్నాయి. పాటలు, గ్లింప్స్, పోస్టర్లతోనే సినిమాపై అంచనాలను గణనీయంగా పెరిగాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని థమన్ ఎస్ అందించారు. పాటలు, నేపథ్య సంగీతం ఈ సినిమా స్థాయిని మరింత పెంచుతాయని భావిస్తున్నారు. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రం జూన్ 26, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

## జూలైలో విడుదల కానున్న ది ఇండియా స్టోరీ

భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాం÷-రతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.





# పెద్ది బాక్సాఫ్ కలెక్షన్ల సునామీ

ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ. 135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్).




## సుదీర్ఘ కాలం తరవాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.



Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380